

# కథా కౌముది

# క్షమ

మన్నెం శారద

సాయంత్రం  మూడూ నాలుగు గంటల వేళ...

రఘురామ్ ఎక్కిన టాక్సీ దట్టంగా అలముకొన్న ఆకు పచ్చని కొండలలో ఘాట్రోడ్డుమీద మెలికలు తిరుగుతూ వేగంగా సాగుతున్నది.

"అంత వేగం వద్దు,  నిదానం గా వెళ్ళు. త్వరగా వెళ్లి చేయాల్సిన పనులేమీ లేవు " అన్నాడు రఘురామ్ డ్రైవర్ తో.

" సరే సార్ " అన్నాడు డ్రైవర్ వినయంగా.

ఒకపదిహేను రోజులపాటు టాక్సీ ని అనుకొన్నదాని కన్నా ఎక్కువ డబ్బుకే రఘురామ్ ఎంగేజి చేసుకున్నప్పుడు ఆ మాత్రం వినయం చూపించక తప్పలేదు డ్రైవర్ కి.

రఘురామ్ ఆ ప్రకృతి ని ఎంజాయ్ చేస్తున్నాడు

అరకులోయకి వెళ్తున్న రోడ్డుదారి అది.

నాగరికత పేరుతో కొంత ...ప్రభుత్వాల దోపిడీలతో కొంత.. ఆ అందాలు కొంతమేర ధ్వంసమైనా కన్నతల్లి లాంటి ప్రకృతి ఓపికగా,  ప్రేమగా పచ్చదనాన్ని ప్రసవిస్తూనే వుంది.

నవంబర్ నెల !

గాలులతో మంచుకలిసి చల్లదనాన్ని పెంచుతున్నాయి.

వరాలిచ్చేదేవతల్లా మేఘాలు క్రిందకి దిగుతున్నాయి. పసుపురంగు తిరిగిన ఆకుపచ్చని లోయలమీద కమ్ముకోవడానికి ప్రయత్నిస్తున్న చీకటి పరదాలు. దూరంగా నీలంరంగు తిరిగి ఆకాశం లో విలీనమవుతున్న పర్వతశ్రేణులు!

మనోహరమైన ఆ ప్రకృతిని చూడటానికి రెండు కళ్ళూ చాలడం లేదు రఘురామ్ కి.

కిటికీ అద్దాలు తీసి ఆనందం గా అణువణువూ చూస్తున్నాడు అతను.

నిజానికి దాదాపు నలభయి ఏళ్లగా అమెరికాలో వుంటున్నాడతను. అందులోనూ అందాలు విరజిమ్మే పెన్సిల్వానియాలో!

ఎటు చూసినా లోయలు గాఢమైన పచ్చదనం ఆకాశంలోకి దూసుకు పోతూ ఏవో ప్రేమ సందేశాలు ఆకాశం లోకి పంపే ప్రియారాళ్ళలాంటి పొడవాటి చెట్లు.

ఇక ఫాల్ లో వాటి సొగసు చూడటానికి రెండు కళ్లూ చాలవు.

కానీ అరకుతో రఘురామ్ కి వున్న ప్రేమానుబంధం ఈ నాటిది కాదు.

విశాఖపట్నం లో ఇంజనీరింగ్ చదివే రోజుల్నుండి అతను అడవులమీద ప్రేమకొద్దీ తరచూ అరకు వేలీకి వస్తుండేవాడు. అక్కడే వుండాలని కలలు కనేవాడు కూడా. వయసు పెరిగే కొద్దీ ఆశలు, ఆశయాలూ దేవుడిచ్చిన వలువలు విప్పి తమకనుగుణ మైన రంగు బట్టలు కట్టుకోవడం మొదలెడతాయి.

అందరూ నడచిన బాటలోనే అతనూ అడుగులు వేసాడు. బాగా సంపాదించాలి. తనకులంలో తనగురించి గొప్పగా చెప్పుకోవాలి ! తాను విసిరే డాలర్స్ కోసం అందరూ అర్రులు చాచాలి  అతని కలలు ఫలించాయి.

ఇప్పుడతను ఎన్నో కోట్లకి అధికారి.

అప్పుడప్పుడూ బంధువుల్లో తన ఆధిక్యతని చూపించుకోవడానికి. అతను ఇండియా వస్తుంటాడు, పేరు కోసం విరాళాలు ఇస్తుంటాడు.

అలాగని అతను దుర్మార్గుడు కూడా కాదు. ఒక సామాన్యుడు! సగటు మనిషి !

ఎప్పుడో అరకులో కొన్న భూమి మీద దోపిడీ మనుషుల కన్ను పడుతున్నదని వచ్చి చూసుకోమని నమ్మకస్థుడు అయిన తండ్రిలాంటి సింహాచలం ఫోన్ లో చెబితే బయల్దేరి వస్తున్నాడతను.

గెస్ట్ హౌస్ చేరేసరికి బాగా చీకటి పడిపోయింది. గెస్ట్ హౌస్ అంటె పెద్ద భవనం ఏమీకాదది. తన పదిఎకరాల స్థలం లోనే రెండుమూడు గదులు, ఒకపెద్దహాలూ, వంటగది హిప్పుడు రూఫ్ తో ఒక డచ్ నిర్మాణం లా ఉంటుందది !

టాక్సీ ని చూస్తూనే పరిగెత్తుకొచ్చాడు సింహాచలం.

"దండాలయ్యా, ప్రయాణం బాగా సాగిందయ్యా?"అని ప్రశ్నిస్తూనే లగేజ్ అందుకుని ముందుకి నడిచాడు సింహాచలం.

రఘురాం తల పంకించి డ్రైవరుకి భోంచేసిరమ్మని డబ్బులిచ్చి సింహాచలం వెంట హాలుని పరిశీలిస్తూ లోనికి నడిచాడు.

హాల్ గదులూ అన్నీ పరిశుభ్రం గా వున్నాయి. తాను ఎప్పుడోగానీ రానని తెలిసినా స్వామిభక్తి పరాయణుడైన సింహాచలం నిజాయితీగా పని చేయడం అతనికి సంతోషం కలిగించింది. స్నానం ముగించి ఏదో తిన్నాననిపించి నిద్రకి ఉపక్రమించాడతను. క్షణాల్లో అలసిన అతని శరీరం గాఢ నిద్రలోకి జారిపోయింది.

తెల్ల వారుతుండగానే భార్య చేసిన కాల్ తో అతనికి మెలకువ వచ్చేసింది.

"ఎలా జరిగింది ప్రయాణం? బాగా నిద్రపట్టిందా?... జెట్లాగ్ లో ఉన్నారా? బిపి టేబ్లెట్ మల్టీ విటమిన్ టేబ్లెట్ మరచిపోకండి "అంటూ ఊదర గొట్టేసిందావిడ.

రఘురామ్ నవ్వుతూ "అదేం లేదు డియర్, జర్నీ బాగానే జరిగింది. శంషాబాద్ నుండి వైజాగ్ వచ్చాక సాయి ఎయిర్ పోర్ట్ కి వచ్చాడు, వాడింట్లోనే లంచ్.. తిరిగి రెండు గంటలకే అరకు బయలుదేరాను. అసలు నిద్రపోలేదు.. మామూలు టైంకే బయల్దేరాను, అందుకే ప్రొద్దుటే లేచిపోయాను" అన్నాడు

"వూ....వద్దంటే వెళ్లారు.వాఁకింగ్ మానకండి..టైం కి భోంచేయండి" అనే రొటీన్ ధర్మాలు రికార్డ్ వేసినట్లు పదేపదే చెప్పి ఫోన్ కట్ చేసింది అతని భార్య సీత.

కిచెన్ లోకి వెళ్లి తనే కాఫీ కలుపుకుని తన పొలం లోకి నడిచాడు.

అదివరకు వచ్చినప్పుడు వేసిన మామిడి, సపోటా జామ బొప్పాయి బలహీనంగా అనాధపిల్లల్లా పెరిగాయి.

అక్కడా అక్కడా కొద్దిగా కాయలూ, పిందెలూ !

సింహాచలం చేతులు కట్టుకుని "నీళ్ళేదతన్నానయ్యా. ఈమ్మజ్జే ఏటో సంకరజాతి పురుగులోచీసి ఉన్నపళంగా పూతామొగ్గా సప్పరించేత్తాన్నాయి అయ్యా !" అన్నాడు తనతప్పేమీ లేదన్నట్లుగా.

"వూ" అంటూముందుకి నడిచాడు కాఫీ సిప్ చేస్తూ.

అతని చూపు జామకాయలమీద వాలి సందడి చేస్తున్న చిలకల జంట మీద వుంది.

ఆ ఏకాంతం, లోయలోని వాతా వరణం చలి చలి గాలులూ.నీలాకాశపు కందువాని ముడి వేసుకుంటున్న ఆకుపచ్చని చేలా కొంగులూ...ఎప్పుడో మనసు పొరల్లో దాచుకున్న భావుకతని బయటకు లాగుతున్నాయి.

సన్నగా ఏదో ఒకపాట కూడా అతని పెదవులపై కదలాడుతుంటే అతను తిరిగొచ్చి హాల్లోని వాలు కుర్చీలో కూర్చున్నాడు.

సింహాచలం కూడా కూడావచ్చి "ఆ పైడితల్లి గాడు గెలిసేక బొత్తిగా ఆరాసకం అనుకొండయ్యా...గోసీకి మూరెడు గుడ్డలేని ఎదవ బడాయికి బారెడు గుడ్డ సుత్తేసుకుంతన్నాడు. ఎదవ గోరోజనం అనీ! కాలీగా జాగా కాపాడ్దదంటే సాలు కాజీసెయ్యడమే...తవరిక్కడకీ రారని దయిర్ణం ఎదవకి..మొన్నవచ్చి ఓ కొలతలేసస్తన్నాడు.

ఏటినీకిక్కడ పని అంటే 'రే కూలీనాకొడకా..సంపేసి అమ్మోరికి ఆరగింపు సేసేస్తానన్నాడు...దిక్కుమాల్న ఎదవ!" అన్నాడు కోపంగా

బదులుగా రఘురామ్ వూ వూ అంటూ "రేపు మాట్లాడతానులేసింహా చలం" అన్నాడు ఏమీ స్వరం పెంచకుండా నెమ్మదిగా.

"మాటాడ్డం కాదయ్యా ఈలయితే నొక్కించేయడీ సన్నాసిగాడ్ని.. తవరిముందా ఈడు దేన్సుకట్టేది....సరే బాబూ మీకు టిపినీ ఏటి అట్టుకురమ్మంటారు ?"అనడిగాడు.

"ఈ రోజుకి ఏమీవద్దులే నా దగ్గర ఏవో వున్నాయి తింటాను. ఆ డ్రైవర్ సంగతి చూసుకో, "అని కొంతడబ్బు సింహాచల చేతిలో పెట్టాడు రఘురామ్.

ఆ మధ్యాహ్నం సింహాచలం తెచ్చిన భోజనం అతనికి సహించలేదు...అతనికి వంటరాదు. నిజానికి ఎంత బిజీ డాక్టరయినా అతని భార్య సీత భర్తని చాలా జాగ్రత్తగా చూసుకునేది.

అమెరికాలో వుద్యోగం చేస్తున్నా ఆమె మూలాలు భారతదేశం లోనే వున్నాయి, రఘురామ్ ని ఆమె చాలా గౌరవం గా చూసుకునేది. కించిత్తు మాటకూడా అనేది కాదు. వృత్తిరీత్యా ఆమె ఎంత బిజీగా వున్నా సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా పని చేసిన భర్తకి ఎంత ఖాళీ సమయం వున్నా ఆమె పని చెప్పేది కాదు. తనసంపాదన ఎక్కువని గర్వం అసలు లేనేలేదు.

అందుకే రఘురాంకి భార్యమీద ప్రేమకన్నా విశ్వాసం ఎక్కువ.

మొదట ఆమెని పెళ్ళిచూపుల్లో అంతగా ఇష్టపడలేదు. ఆమె అతను ఊహించుకున్న ఊహాసుందరి కాదు, సామాన్యమైన రూపం, అప్పటికే అమెరికాలో ఉద్యోగరీత్యా సెటిల్ అయ్యింది.తనిప్పుడు ఆమెవలన అమెరికా జేరి ఎమ్మెస్ చేయాలి, ఎలా భావిస్తుందో అని వెయ్యి సందేహాలు.

చివరికి తండ్రి మందలింపుతో అమెరికా వెళ్లాలన్న బలమైన కోరిక తో అతను పెళ్ళికి ఒప్పుకోవడమూ అమెరికా జేరడం చకచకా జరిగి పోయాయి.

జీవితం తాను అనుకున్నదానికన్నా సౌఖ్యం గా నడుస్తున్నది.

అప్పుడప్పుడూ ప్రేమించి వివాహం చేసుకోలేదనే చిన్న చింత, కనీసం కాలేజీలోనన్న చిన్న ప్రేమకథ నడపలేకపోయానన్న దిగులూ అతని మనసుని ఆవరించి కొంచెం బాధ పెడుతుంటాయి.

చూస్తుండగానే సీతతో తన వైవాహిక జీవితానికి నలభయి ఏళ్ళు నిండి పోయాయి.

సీత అతన్ని ఒకగాజు బొమ్మలా చూసుకుంటున్నది. పిల్లలు పెద్దవాళ్లయి తల్లి ప్రోత్సాహంతో డాక్టర్లుగానే సెటిల్ అయ్యారు. కోడళ్ళు కూడా అదే వృత్తి లో కొనసాగడం వలన ఆ ఇల్లంతా ఐశ్వరం పరచుకుంది.

సీత ఇప్పుడు వుద్యోగం వదిలేసి పూర్తిగా ఇంటిపట్టున రెస్ట్ తీసుకుంటున్నది. కోడలి డెలివరీ ఉండడం వలన ఆమె రఘురామ్ తో రాలేక పోయింది కానీ లేకపోతే ఆమె అతన్ని ఒంటరిగా ఎక్కడికీ పంపదు.

ఆమె, పిల్లలూ ఈ వయసులో ఒంటరిగా మీరిప్పుడు వెళ్లాల్సిన పనేముంది, తర్వాత వెళ్లొచ్చని వారించినా కాదూ కూడదంటూ కొంత మొండితనం గానే ఇండియా కి బయల్దేరేడతను.

ఎప్పుడూ ఏ అడుగేసినా ఇటు ఇండియాలోనూ, అటు అమెరికాలోనూ అతన్ని సీతావిధేయుడి గానే చుట్టాలూ, . స్నేహితులూ బాహాటం గానే తన గురించి అనుకోవడం అతనికి ముల్లుగుచ్చుకున్నట్లు గానే ఉండేది.

అందుకుగానే అతను కొంత ఆ నీడనుండి బయటకి వచ్చి స్వేచ్ఛా వాయువులు పీల్చాలనే మొండికేసి బయల్దేరాడు.

కానీ సీతలేని ఇబ్బంది అతనికిప్పుడు బాగా తెలుసొస్తున్నది. ముఖ్యంగా భోజనం విషయంలో....అతను రాజీ పడలేకపోతున్నాడు.

ఆ విషయమే సింహాచలానికి చెప్పి " ఇక్కడ ఎవరయినా కొద్దిగా వంట చేసి పెట్టేవారుంటే చూడు, నాకీ హోటల్ భోజనం పడటం లేదు "అన్నాడు.

బదులుగా సింహాచలం బుఱ్రంతా గీక్కుని “మీకొండేపాటోల్లా ఈ సన్నాసులు , , , , సూస్తానయ్యా” అన్నాడు కొంచెం సందేహంగా.

కానీ ఆ సాయంత్రమే ఒక అమ్మాయిని వెంటపెట్టుకొచ్చాడు సింహాచలం.

హాల్లో టివి చూస్తున్న రఘురామ్ ఆ ఇద్దర్నీ ఆశ్చర్యంగా చూసాడు.

"ఈపిల్ల పేరు నీల బావూ, . వంట బాగా వండుద్ది. అందుకే అత్తుకొచ్చేసా "అన్నాడు.

నీల రఘురాంకి నమస్కరించి తలదించుకుని నిలబడింది.

"ఇదిగో రా! ఇదే వంటగది, అయ్యోగోరికి కాస్త టీ ఎట్టి అట్టుకురా.పద"అంటూ వంటగదిలో, సరుకులూ చూపించి మళ్ళీ బయటకి వచ్చాడు సింహాచలం.

"సింహాచలం, అమ్మాయిని తెచ్చావేంటి, తనకి ఇబ్బంది కదా...దూరంగావున్న గూడెంకి ఎలా వెళ్తుంది?"అన్నాడు రఘురామ్ అయిష్టంగా.

"ఎల్లదు బావూ, మనతోటె వుంటాది "

సింహాచలం జవాబువిని కొద్దిగా తెల్లబోయినట్లు చూసాడు రఘురామ్.

ఆయన కళ్ళలోని సందేహాలు అర్ధం చేసుకున్నట్లుగా సింహాచలం నిట్టూరుస్తూ నేలమీద కూలబడి “ఈ బొట్టికి ఎవురూ నేరు బావూ.సిన్నతనాన్నే లగ్గం సేస్తే ఆడు తాగి తన్ని సివరికి ఊపిరితిత్తుల రోగమొచ్చి సచ్చినాడు. అమ్మాబావూ నేరు. అన్నకాడ తల దాసుకుంటే ఆ వొదినముండ ఆడని మాటనేదు. ఎలాగో ఇంటిసాకిరీ సేసి కాస్త అచ్చరం ముక్కలు నేర్చింది .మీ కాడవుండే...ఆ డబ్బా మీన కూడ పనిసేస్తాది. మొన్నటిదాకా సేసింది కానీ ఆ ఆపీసు ఇసాపట్నం ఎల్లిపోనాది.వదిన ఎల్లగొడితే మా ఇంటి పక్కనే ఉంటాన్నది."అంటూ నీల గురించి కొంత వివరాలు అందించాడు.

ఇంతలో ఒక ట్రే లో టీ తీసుకొచ్చింది నీల, ఇస్తున్నప్పుడు ఆమె చేతులు సన్నగావణకడం గమనించాడు రఘురామ్.

ఇంతలో పొలంలోకి వస్తున్న పశువుల్ని తోలేందుకు సింహాచలం అక్కడనుండి వెళ్ళిపోయాడు.

"నువ్వూ తాగలేకపోయావా ?"అన్నాడు మాటకలుపుతూ రఘురామ్.

"అలవాటు లేదు సార్ !" అంది చిన్నగా గొణిగినట్లు.

"కూర్చో" అన్నాడతను

నీల భయపడుతూ క్రింద కూర్చో బోయింది.

"అదేంటి కుర్చీలో కూర్చో "

ఆ మాటకి ఇంకా బిగుసుకు పోయింది నీల అలాగే నిలబడి.

"నీ గురించి సింహాచలం కొంత చెప్పాడు, నీకు అభ్యంతరం లేకపోతే ఆ పక్కగదిలో వుండొచ్చు నువ్వు, ఏం భయం లేదు. ఫ్రీ గావుండు. ఏ కూరలు చేసినా ఫర్వాలేదు కారం మాత్రం తగ్గించు. నాకు పడదు. "

"వూ "అంటూ తల ఊపింది నీల.

ఆ రాత్రి భోజనం ఆమె సీత అంత కమ్మగా వండకపోయినా ఫర్వాలేదనిపించింది. అతను తిన్నంత సేపూ భయంగా అతన్నే వంటగది వారన నిలబడి గమనిస్తున్న నీల "బాగుంది బాగా చేసేవ్!" అన్నమాటకి ఉబ్బితబ్బిబ్బయింది.

"నువ్వూ భోంచెయ్ "అని చెప్పి తనగదిలోకి వెళ్ళిపోయాడు రఘురామ్.

నాలుగు రోజులు భయం భయం గా బెరుకుగా గడిచాయి నీలకి. పనికాగానే సింహాచలం దగ్గరకి పరిగెత్తుకెళ్లి తోటపనిలో అతనికి సహాయపడుతుండేది.

"ఏటినీలామ్మా బావుగారిని సూసి బయపడతన్నావా? దేవుడాయన ! ఏటి పెద్ద ఆటడిపోతన్నాని ...అడక్కుండానే డబ్బులు సేతిలో ఎట్టేస్తారు, మాటసూసేవా ఎన్నకి రొట్టెపూసినట్టే వుంటాది, ఇక్కడకూసుంటే ఎలా? రేపుటనుంచి కమ్మగా టిఫిను కూడాసెయ్యి. కూంత మంచీసెడ్డా కనుక్కో "అన్నాడు

"వూ "అంటూ లేచి లోపలి నడిచింది నీల.

నీల వెళ్లేసరికి రఘురామ్ ఫోన్ లో మాట్లాడుతున్నాడు.

"లేదు డియర్, అంతా బాగానే వుంది నథింగ్ టు వర్రీ, అతను రేపు వస్తున్నాడు, ఈ లోపునే సాయి అంతా సెటిల్ చేసాడు.......భోజనమా హోటల్ ఫుడ్ తినడం లేదు, ఇక్కడే వంటకి ఏర్పాటు చేసాడు సింహాచలం. సరేనా ?"

అతను భార్యతో మాట్లాడుతున్నాడని అర్థమైపోయింది నీలకి.

"తనపేరు చెప్పలేదేంటి!'తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది నీలకి,

"నీలా !"రఘురాం మెత్తని పిలుపు.

నీల 'సార్' అంటూ బయటకి వచ్చింది

"సలాడ్స్ ఏమయినా చేయగలవా ? "

సందేహంగా చూసింది నీల.

"పెద్దకష్టం ఏమీకాదు పద, నేను చూపిస్తాను "అంటూ అతను చొరవగా వంటగదిలోకి వస్తుంటే పిల్లిపిల్లలా అతని వెనుక నడిచింది నీల.

అతను గబగబా కొన్ని కూరగాయలు పళ్ళూ తీసుకుని సన్నగా కట్ చేసి వాటిపై కొత్తి మేర వేసి నిమ్మకాయ పిండి ఇంతే. ఇదే నేను అమెరికాలో ఉండి నేర్చుకున్న ఏకైక వంట "అంటూ రెండు డిషెస్ లోకి తీసి ఆమెకొకటి ఇచ్చి "తిను ఆ సింహాచలంలా పడెయ్యకు "అంటూ నవ్వాడు.

నీల సిగ్గుగా తలదించుకుంది .

నీల కొంచెం ధైర్యం గా వచ్చి అతని ముందు కూర్చుంది.

"నీగురించి చెప్పు "అన్నాడతను మృదువుగా, నీల తల ఎత్తి అతని వైపు కొద్దిగా ఆశ్చర్యం గా చూసింది.

"నా గురించి ఏముంటాయి సార్. మామూలు గూడెం పిల్లనే "అంది మెల్లిగా.

అతను చిన్నగా నవ్వి "ఎందుకుండవ్ ప్రతిమనిషి ఒక ఇండివిద్యుయేలే కదా...ఎవరి చరిత్ర వారికుంటుంది.ఏం చదువుకున్నావ్, మీ ఫెమిలీ బేక్గ్రవుండ్ ఇష్టమైతేనే "అన్నాడు.

నీల అతనలా ఆత్మీయంగా అడుగుతుంటే కొద్దిగా కరిగిపోయింది. అతని గొంతులో మేజిక్ అదే! ఏ సందర్భం లోనూ అతను గొంతు పెంచడు, చిరునవ్వు వీడడు, అహంకార ధోరణులు కనబరచడు.

ఆ స్వభావమే నీలలో అతని పట్ల వున్న భయం పోయేలా చేసింది. అంతేకాక అతనంటే ఒకలాంటి గౌరవంతో కూడిన అభిమానం కలిగేలా చేసింది కూడా.

"చెప్పుకునేంత ఘన చరిత్ర ఏమీ లేదు సార్, నాన్న వున్న ఎకరం పొలం వ్యవసాయం చేసేవాడు, ఒక అన్న వున్నాడు. నాన్న ఉండగానే నాపెళ్ళి జరిగిపోయింది. అతను తాగి తాగి ఊపిరితిత్తుల జబ్బుతో చచ్చిపోయాడు"అంటూ ఆగి అతని కళ్ళలోకి చూసింది నీల.

రఘురామ్ కళ్ళుమూసుకుని వింటున్నాడు.

"అన్నయ్య నిన్ను బాగా చూసుకుంటాడా ?"

అతని ప్రశ్నకి బదులు రాకపోవడం తో రఘురామ్ కళ్ళు తెరచి చూసాడు

నీల తలదించుకుంది.

ఆమె దుఃఖపడుతున్నదని అర్థం కాగానే అతను "సారీ వద్దులే...ఏం చదువుకున్నావ్? అనడిగాడు టాపిక్ మారుస్తూ.

"ఇంటర్ పాసయ్యాను సార్. కొంత కంప్యూటర్ వర్క్ కూడా నేర్చుకున్నాను.ఇక్కడే ఒక కంపెనీ లో పని చేసాను కూడా.ఆ కంపెనీ ఎత్తేసారు.దానితో పని పోయింది "

"మరిప్పుడెలా ? "

"అమ్మ బతికుండగా లేసులల్లి, కొన్ని వెదురు బొమ్మలు చేసి గిరిజన కేంద్రానికి అమ్మేది. అమ్మతో నేను కూడా నేర్చుకున్నాను, వాటితోనే ప్రస్తుతం. సింహాచలం బాబాయ్ ఇంటి పక్కనే ఒకగదిలో వుంటాను."

"ఖాళీ వున్నప్పుడు ఇక్కడకూడా నీ పనులు చేసుకో !" అని రఘురామ్ అంటుండగానే " ఆ పైడిగాడొచ్చాడు బావూ" అంటూ సింహాచలం వచ్చి చెప్పగానే రఘురామ్ బయటకి వెళ్ళాడు.

రఘురామ్ వెళ్ళినవైపు మొదటిసారి కన్నార్పకుండా చూసింది నీల.

ఆచూపులో ఒకలాంటి కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది,

"ఎనుబోతులాంటి పైడితల్లిని పిల్లిపిల్లని చేసి అంపేసారు బావుగారు. నీలీ, ఏటో బావుగారి మాట! అట్టే నోరుసెయ్య నేదుకూడా !"అంటూ తమయజమాని గొప్పదనం చెబుతుంటే నీలి నవ్వుతూ వింటున్నది.

"మనం కొన్ని కొత్త మొక్కలు కొందాం రండి "అంటూ సింహాచలాన్ని నీలని కూడా పిలిచాడు రఘురామ్ అక్కడకొచ్చి.

డ్రైవర్ని అవసరముంటేనే పిలుస్తానని ముందే చెప్పడంతో అతను గూడెం లో వాళ్ళవాళ్ళింటికి వెళ్ళిపోయాడు.

కారు ఒక మంచి బొటానికల్ గార్డెన్స్ కి వెళ్ళింది, అందరూ గార్డెన్ అంతా తిరిగి చూసాకా కొన్ని పళ్ల మొక్కలూ, పూల మొక్కలు కొన్నాక తిరిగి రాబోతుండగా' సార్' అంది నీల మెల్లిగా.

ముందు నడుస్తున్న రఘురాం వెనక్కి తిరిగి చూసాడు. పసుపు పచ్చ సంపెంగ మొక్కలదగ్గర ఆగిపోయింది నీల.

"ఇదొకటి తోటమధ్య వేయండి సార్. మంచిసువాసన, బాగుంటుంది "అంది మెల్లిగా నీల అతని మొహం లోకి చూస్తూ.

వెంటనే రఘురామ్ " ఒకే దానికేముంది !"అంటూ ఆరోగ్యం గా వు ఓ సంపెంగ మొక్కని కొన్నాడు.

దార్లో వెదురు బొమ్మలకి లేసులకి కావాల్సిన సరుకు, సూదులూ దారాలు నీలకి ఇప్పించి గెస్ట్ హౌస్ చేరుకున్నాడు రఘురామ్..

తోట పని మొదలయ్యింది. ఎరువులూ, ఎర్రమట్టీ వచ్చాయి. ట్రాలీ లో వచ్చిన మొక్కలన్నీ ఒకపక్కన కొలువుదీరేయి.

మరొపక్కన పొలానికి ఫెన్సింగ్ పని మొదలయ్యింది. మధ్యలో వరి, కొంత సన్ఫ్లవర్ పంటలు వేసేట్లు తీర్మానించుకుని చుట్టూ పళ్ళ మొక్కలు, కొబ్బరి మొక్కలూ వేసేట్లుగా పనివాళ్ళకి పురమాయించాడు రఘురామ్.

వంటపని కాగానే తోటపనుల్లో కొంతమేర జోక్యం చేసుకుంటున్నది నీల. ఓ చెట్టునీడన వాలుకుర్చీలో కూర్చుని నీల ఇచ్చిన గ్రీన్ టీ తాగుతూ సీతకి జరుగుతున్న పని గురించి చెబుతూ పనివారిని గమనిస్తూ సంతోషంగా కాలక్షేపం చేస్తున్నాడు రఘురామ్.

ముఖ్యంగా నీలలో వచ్చిన మార్పు అతనికి ఆశ్చర్యం కలిగించింది. మొదట వచ్చినప్పుడుండే బెరకు భయం పోయి ఇప్పుడు ఉత్సాహంగా మారింది. రివ్వున తూనీగలా తోటలో తిరుగుతూ సింహాచలాన్ని పనివాళ్లని కూడా దబాయిస్తూ పనులు చేయిస్తున్నది.

"పిట్ట కూతబట్టింది సారూ...దీనికి కాస్త మేత తగ్గించాలా !"అని సింహాచలం ఛలోక్తులు విసురుతుంటే నవ్వేవాడు రఘురాం.

ఆరోజు తోటలో నీల గొంతు గట్టిగ వినిపిస్తున్నది, ఇంచుమించు దెబ్బలాడుతున్నట్లుగా. పనివాళ్ళు కూడా ఎదురుజవాబులిస్తున్నారు. స్నానం చేసి డ్రెస్ మార్చుకుని కంగారుగా అక్కడకి వచ్చాడు రఘురామ్.

"సూడండి బావూ ఈ గుంత సంపెంగి మొక్క ఫెన్సింగ్ ఓర ఎయ్యద్దంటన్నది. గులాబీ మొక్కలమజ్జెన ఎయ్యాలంట! ఇది పెద్ద మను కట్టి పెద్ద సెట్టయిపోతాది బావూ"అన్నారువాళ్ళు కోపంగా నీల వైపు చూస్తూ.

రఘురామ్ నీలవైపు చూసాడు, నీల భయం గా నిలబడిపోయింది తలదించుకుని.

"నీల ఎలా చెబితే అలా చెయ్యండి "అంటూ వెనక్కి వచ్చేసాడు రఘురామ్.వెళ్తున్న అతనివైపు రెప్పార్పకుండా చూసింది నీల అయోమయంగా.

రాత్రి అతనికి భోజనం పెడుతూ "క్షమించండి సార్, ఆ చెట్టు తోట మధ్యలోనే బాగుంటది, ఎల్లకాలం ఉంటది, మంచి సువాసన. పవిత్రమైన పూలు. సింహాచలం అప్పన్నకి ప్రీతిపాత్రమైన పూలు. అందుకే అక్కడ నాట మన్నాను" అంది సంజాయిషీ ఇష్తున్నట్లుగా.

అమర్నాడు అక్కడ సంపెంగి చెట్టు నాటడమే కాదు ......మొక్క భవిషత్తులో మాను కట్టేమేర జాగా వదిలి చుటూ చప్టా కూడా ఇటుకలతో కట్టించేసింది నీల.

రఘు రాం వచ్చి చూస్తుంటే “ఈసారి మీరు వచ్చినప్పుడు మీరీ అరుగు మీదకూర్చుంటే ఈ పూలు మీ పైన రాలతాయి సార్!” అంది నీల నవ్వుతూ..

ఈసారి రఘురామ్ కి నవ్వురాలేదు. నీలనుండి చూపుతిప్పుకుని తోటలోని పనులు పరిశీలిస్తూ అతను మరోవైపు వెళ్లపోయాడు.

తాను ఎక్కువగా గానీ మాట్లాడుతున్నానేమోనని కొద్దిగా భయం వేసింది నీలకి.

అలా మొక్కల్లో నడుస్తూ చూస్తుండగా ఒక్కసారే ఏదో చప్పుడూ ఆ వెంటనే “అయ్యో సారూ” అన్న కేకలు వినిపించి అటు చూసింది నీల.

రఘురామ్  రాత్రికురిసిన నేలలో అడుగేసి జారీ పడిపోవడం కుడికాలు బెణికి పోవడం ఒక్కసారిగా జరిగిపోయాయి. నీల గబగబా అక్కడకి కంగారుగా పరిగెత్తింది..అప్పటికే అతన్ని పనివారు ఎత్తి కారులో కూర్చోబెట్టి సింహాచలం మరికొంతమంది పనివారు దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లిపోయారు

నీల స్థాణువులా వరండాలో కూలబడిపోయింది.

'ఇన్నాళ్లుగా బాగానే జరిగింది, ఊరుకాని వూరు, దేశం కానీ దేశం వచ్చారు ఎలాగుంటదో !'అని బాధపడుతూ కాలికేంకాకుంటే అప్పన్న గుడికొస్తానని మనసులోనే మొక్కుకుంది నీల.

ఒక రెండు గంటల తర్వాత కాలికి బ్యాండేజ్ తో  మెల్లిగా కారు దిగి సింహాచలం తదితరుల సాయంతో అతను తానే నడుస్తూ వచ్చాడు.

తీసుకెళ్లి అతని గదిలో పడుకోబెట్టి బట్టలు మార్చదు సింహాచలం.

"నయ్యం కాలిరగలేదు బెణికింది, వారంపాటు కదలద్దన్నారంతే !"అన్నాడు సింహాచలం నిట్టూరుస్తూ.

నీల మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టుకుని గాలి పీల్చుకుంది.

"నానూ సానా బయపడిపోనానే నీలీ...పెద్ద వయసూ...ఒంటిగా వొచ్చి ఇక్కడ సిక్కడిపోనాడు పావం!' అంటూ క్రిందచతికల బడి ఏదో గుర్తొచ్చినట్లుగా జేబులోని పేకట్ తీసి

"యియ్యిగో ఈ మందులేయ్యాలంట మూడు పూట్లా ! ఒణ్ణం తినరంట. సూపెట్టమన్నారు "అని చెప్పాడు నీలికి.

గబగబా వంటగదిలోకెళ్ళి సూప్ తయారు చేసింది నీల. అంతకుముందే సూప్ చేయడంకూడా అతను నెట్ లోచూపించేదు. ఇప్పుడు చాలా అతనికిష్టమైన వంటలు అందులో చూసే చేస్తున్నది.

సూప్ బౌల్ తీసుకుని రఘురామ్ గాడి దగ్గర సందేహం గా నిలబడింది నీల.

మంచం మీద తలగడల ఆధారంగా జారబడి ఎడంచేత్తో సెల్ పట్టుకుని చూస్తున్న రఘురామ్ నీలని లోపలికి రమ్మన్నట్లుగా సైగ చేసాడు.

నీల లోపలి వెళ్లి సూప్ డిష్ స్టూల్ మీద పెట్టింది.  అతను తలగళ్లకి జేరబడటానికి ఇబ్బంది పడుతుంటే నీల అతని భుజాలు పట్టుకుని సహాయపడింది.

"థాంక్యూ నీలా,  ఈ అడవిలో నీలాంటి పిల్ల దొరకక పోతే నేను చాలా ఇబ్బంది పడిపోయేవాణ్ని. రియల్లీ ఐయామ్ లక్కీ !" అన్నాడతను చిరునవ్వుతో.

ఆ మాటకి నీల మొహం సంతోషంగా విచ్చుకుంది.

"నాదేముంది సార్,  మీకు ఎవరయినా చేస్తారు!" అని చిరునవ్వుతో బయటకు వచ్చి వంట పనిలో పడింది.

వారం రోజుల్లో  అతను నీల పర్యవేక్షణ లో పూర్తిగా కోలుకున్నాడు.

నీల కూడా అతని దగ్గర పూర్తిగా బెరకు పోయి కబుర్లు చెప్పడం,  అతని జోక్స్ కి నవ్వడం చేస్తున్నది.

ఆరోజు నీల గదిలోంచి బయటకి రాబోతుంటే ఆకస్మాత్తుగా జరిగిందా సంఘటన!

రఘురాం ఆమె చెయ్యి పట్టుకుని తన గుండెలకానించుకుంటూ " అయ్ లవ్ యు నీలా!" అన్నాడు తమకం గా.

ఆ ఆకస్మిక చర్యకు నిలువెల్లా వణికి పోయింది నీల. బలవంతంగా తనచేతిని అతని చేతినుండి విడిపించుకోబోయింది.

బదులుగా రఘురాం ఆమె చేతిని మరింత ధృడంగా పట్టుకుని  "నన్ను నమ్ము నీలా,  నేను జీవితమంతా ప్రేమరాహిత్యంతో బ్రతికినవాణ్ని. నా భార్య నన్ను బాగానే చూస్తుంది. టైముకి మందులు,  ఆహారం... డబ్బు లావాదేవీలు... అన్నీ! కానీ అంతా మెకానికల్!

ఆమెను చూస్తుంటే బెత్తం పుచ్చుకుని స్టూడెంట్ ని బెదరిస్తున్న పంతులమ్మ మాత్రమే గుర్తొస్తుంది. నువ్వు నా మనసుని కదిలించావ్,  రియల్లీ అయ్ లవ్ యు!" అన్నాడతను తమకంగా.

సింహాచలం వస్తున్న చప్పుడు విని నీల అతని చేతిని విడిపించుకుని గబగబా వెళ్లి తోటలో అరుగు మీద కూర్చుంది.

అతను తనకన్నా చాలా పెద్దవాడు,  డబ్బున్నవాడు,  పైగా వేరేదేశం లో ఉండేవాడు... తన ప్రేమని ఆశించిడమేంటి..??

అయినా మనసుని మభ్యపరుస్తున్న ఒక సంతోషం,  చిన్నపాటి గర్వం.. తనకీ తనని ప్రేమించేవారు ఒకరున్నారని, ఒంటరిని కానని పిచ్చినమ్మకం... ఆమెని నిలువనియ్యడం లేదు.

ఆరోజు ఆ ఫోన్ కాల్ వినకపోతే ఏం జరిగేదో కానీ  ఆమె గుమ్మం పక్కనే నిలబడిపోయింది.

"బాగున్నాను డియర్,  నిన్ను ఎంతగా మిస్ అవుతున్నానో తెలుసా... రియల్లీ అయ్ లవ్ యూ... ఆఆ.. ఫర్వాలేదు ఇక్కడో వంటవాడు దొరికాడు. ట్రైబలే అనుకో.. మేనేజ్ అయ్యా.! నీ చేతి అమృతం లా ఎలావుంటుంది!" గుమ్మం పక్కనుండి వడిగా వెళ్లిపోతున్న నీలని గమనించి అతను గబగబా ఆమె కూర్చున్న అరుగు దగ్గరకెళ్లి పక్కన కూర్చున్నాడు.

నీల దిగ్గున లేచి నిలబడింది.

"అంతా విన్నావా.. ఏం చెయ్యను.. అలా చెప్పకపోతే తినేస్తుంది డెవిల్, సారీ!" అన్నాడు సంజాయిషీ ఇస్తున్నట్లుగా.

నీల బదులుగా నవ్వింది.

నాలుగు రోజుల్లో నీలలో వచ్చిన మార్పు గమనిస్తున్నాడు సింహాచలం. మనిషి జబ్బు చేసినట్లు చిక్కిపోయింది.

ఆమెని క్రీగంట గమనిస్తూ పక్కనే పొగాకు చుట్టగా చుట్టుకుంటూ " సారు ఎల్లే రోజులు దగ్గరపడ్డాయి గుంతా, ఇగ మన బతుకులు మనయ్యి " అన్నాడు అన్యాపదేశంగా.

నీల మౌనం గా విన్నది

కారు విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ కి బయలుదేరుతుండగా రఘురాం గారి చూపులు చుట్టూ పరికించి చూసాయ్.

అక్కడ నీల జాడలేదు.

అతను సింహాచలానికి కొంత డబ్బు ఇస్తూ" నీల ఏదీ?" అనడిగాడు.

"వంట్లో బాగాలేదని రాలేదయ్యా, కింద గూడానికి బోయింది" అన్నాడు సింహాచలం.

"ఈ డబ్బు నీలకివ్వు, ఇది నా ఫోన్ నెంబర్ "అనిచెప్పి కారెక్కాడు రఘురాం.

కారు ఘాట్ రోడ్డులో సాగిపోయి కనుమరుగయ్యేంత వరకూ చూసి గాఢాంగా నిట్టూర్చి వెను తిరిగాడు సింహాచలం.

ఇండియా నుండి వచ్చిన దగ్గర్నుండి భర్త ప్రవర్తనలో వచ్చిన మార్పు కొంత గమనిస్తుంది సీత.

రాత్రులు సరిగ్గా నిద్రపోవడం లేదు అక్కడ నుండి, ఫోన్ని పదే పదే చూడటం.. ఆమె దృష్టిని దాటిపోలేదు.

ఒకటి రెండుసార్లు ఆరోగ్యం గురించి ఆరాతీసింది కూడా. అతను అంతాబాగానేవుందని దాటేసాడు.

ఆరోజు అతను నిద్రలోకి జారిపోయినప్పుడు పక్కమీద పడిపోయిన ఫోన్ తీసి వాట్సాప్ లోని మెసేజ్ చూసి నివ్వెర పోయిందామె.

"నేను బీదదాన్ని కావొచ్చు, ఒంటరి దాన్ని కావొచ్చు, నాలుగు రోజుల కాలక్షేపానికి ప్రేమ అనే పదం ఎందుకు వాడేరు? మీ యోగ క్షేమాలు అంతగా కోరుకునే మీ భార్యమీద ఎందుకన్ని అబద్ధాలు చెప్పారు.! మీ తాత్కాలిక వినోదం కోసం మనసులతో ఆటలాడకండి. మీరు నాకిమ్మని ఇచ్చిన డబ్బు తోటపనికి వాడమని సింహాచలానికి తిరిగి ఇచ్చేసాను. మీ డబ్బున్నవారు ఆడే ఆటలకి లొంగేవారు కాదు ఈ మన్నెం బిడ్డలు!"

ఆఁ మెసేజ్ చూసి తలతిరిగి పోయింది సీతకు.

తెల్లవారి మొహం కడుక్కుని కాఫీ తాగుతున్న భర్తకు ఆఁ మెసేజ్ చూపించి "ఏంటిది?"అనడిగింది సీత.

అదిచూసి రఘురాం మొహం వేళ్ళాడి పోయింది.

"క్షమించు!" అన్నాడు సన్నగా గొణిగినట్లు.

ఆమె నిస్పృహగా నవ్వింది. "ఇన్నాళ్లుగా కాపురం చేసినందుకు చేసేదేముంది... క్షమిస్తాను.. కానీ ఏకకాలం లో హృదయాన్ని కేకుముక్కల్లా పంచగల మీలాంటి ఔదార్య పురుషుణ్ణి ఆఁ అమ్మాయి క్షమించగలదేమో కనుక్కోండి!"అంటూ అక్కడ నుండి వెళ్ళిపోయింది సీత.

ఇప్పుడతను ప్రాణమున్న శవం వారిద్దరి దృష్టిలో!

COMMENTS